# క్రీస్తు శ్రమల ధ్యానం

క్రీస్తు శ్రమల ధ్యానాన్ని (lent season) సంఘాలు రకరకాలుగా ఆచరిస్తారు. చారిత్రకంగా, సంఘకార్యక్రమంలో క్రీస్తు శ్రమల ధ్యానం భస్మ బుధవారంతో మొదలై పరిశుద్ధ వారంతో అంతమవుతుంది. శ్రమల కాలంలో సంఘం ప్రార్థనాపూర్వకంగా సిద్ధపడుతుంది. కొంతమంది ఈ 40 రోజులు ఉపవాసం ఉంటారు. మరికొంతమంది కొన్ని సుఖాలను త్యజిస్తారు. శ్రమల కాలంలో క్రైస్తవ సంఘంలో ఆయావిధాలైన ఆరాధనలు జరుపుకుంటారు. ప్రవాస భారతీయులమైన మనం భారతదేశంలో శ్రమల కాలంలో ఆచరించే కొన్ని సాంప్రదాయాలను మర్చిపోకూడదు. వీటిని సాంప్రదాయంగా ఆచరించడం కంటే వాటిలోని అర్థం తెలుసుకుని, అర్థవంతంగా ఆచరిస్తే ఫలితం ఉంటుంది. వాటిలో కొన్నిటిని తెలుసుకుందాం.

**భస్మ బుధవారం (Ash Wednesday)**: భస్మ బుధవారం శ్రమలకాలానికి ప్రారంభం. ఇది ఈస్టరుకు ముందు 7 వ బుధవారం నాడు వస్తుంది. భక్తుల నొసట బూడిదతో సిలువ గుర్తు పెట్టడం అనే ప్రాచీన సాంప్రదాయం నుండి ఈ పేరు వచ్చింది. గత సంవత్సరం మట్టలాదివారం నాడు ఉపయోగించిన మట్టలను కాల్చి బూడిదగా చేసి, భస్మ బుధవారం రోజు సంఘ కాపరులు ఆ బూడిదతో భక్తుల నొసట మీద సిలువ గుర్తు పెడతారు. ఇది పాపం ఈ లోకంలోకి తెస్తున్న మరణానికి సూచనగాను, పశ్చాత్తాపానికి, దీనత్వానికి సూచనగా ఉంది.

**పరిశుద్ధ గురువారం (Maundy Thursday):** పరిశుద్ధ గురువారం మంచి శుక్రవారానికి ముందురోజు. దీన్ని ప్రభువు సిలువకు వెళ్ళకముందు మేడగదిలో చివరి రాత్రి పస్కా భోజనం ఆచరించిన దానికి సూచనగా జరుపుకుంటారు. "మాండీ" అనే పదం లాటిన్ లో "మాండేటం" అనే పదం నుండి వచ్చింది. దీని అర్థం "ఆజ్ఞ". నేను మిమ్ములను ప్రేమించినట్లే మీరునూ ఒకరినొకరు ప్రేమించుకొండి అని ప్రభువు శిష్యులకు ఇక్కడే ఆజ్ఞ ఇచ్చారు.

**మట్టలాదివారం (Palm Sunday):** పునరుత్థానదినానికి ముందు ఆదివారాన్ని మట్టలాదివారంగా ఆచరిస్తారు. యేసు ప్రభువు యెరుషలేం పట్టణానికి గాడిద పిల్లమీద ఎక్కి వచ్చిన దినం ఇది. ఆ రోజు ప్రజలందరు మట్టలు పట్టుకుని దావీదు కుమారునికి జయము అని అరుస్తూ ఆయన్ను వెడించారు. మట్టలాదివారు నాడు బాలబాలికలు ఈత మట్టలకు పూలు గుచ్చుకొని స్తుతి ఆరాధనకు గుర్తుగా వాటిని సంఘానికి తీసుకువస్తారు. యేసుప్రభువును రాజుగా గుర్తుచేసుకుంటూ దీన్ని ఆచరిస్తారు.

**మంచి శుక్రవారం (Good Friday):** మంచి శుక్రవారంగురించి మనందరకు తెలిసినదే. యేసు ప్రభువు సిలువ వేయబడిన రోజు ఇది. ఇది మంచి శుక్రవారం ఎందుకైందంటే ప్రభువు మరణం ద్వారా మనకు రక్షణ వచ్చింది కాబట్టి. చాలామంది క్రైస్తవులు ఈ రోజున ఉపవాసం ఉంటారు. క్రీస్తు శిలువపై పల్కిన 7 మాటల్ని సంఘాల్లో ధ్యానిస్తారు. కొన్ని సంఘాలు క్రీస్తు శిలువ పై వ్రేలాడిన సమయాన్ని ఆధారం చేసుకుని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటలవరకు ఈ ధ్యానాన్ని జరుపుకుంటారు.

**పునరుత్థాన దినం (Easter):** తాను ముందుగా చెప్పినట్లు యేసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన దినం ఇది. క్రైస్తవ్యాన్ని మిగిలిన అన్ని మతాలు, విశ్వాసాల నుండి వేరుపరిచేది ఈ సత్యమే. మరణానంతరం నిత్యజీవముందనే నిరీక్షణకిది నిదర్శనం. అపోస్తలుడైన పౌలు 1 కొరింథీ 15 వ అధ్యాయంలో రాసినట్లు క్రీస్తు తిరిగి లేవకపోతే మన విశ్వాసం వృధా అయినట్లే, మనం ఇంకా మన పాపాల్లో ఉన్నట్లే. ఈ పునరుత్థాన శక్తిని మన అనుదిన జీవితాల్లో అనుభవించాలని బైబిలు చెప్తుంది.

శ్రమల కాలంలో మనం ఈ ఆచారాల్ని అర్ధవంతంగా ఆచరిస్తూ మనం దేవునికి ఇంకా సన్నిహితం కావడానికి ప్రభువు మనకందరికి సహాయం చేయును గాక.

- పాల్ & హెప్సీ సుంకరి